క్లుప్తంగా

నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఏపీఎంగా రాంనారాయణగౌడ్



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా రాంనారాయణగౌడ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన జగదీశ్‌కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా మద్నూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నాగిరెడ్డిపేట ఏపీఎంగా ఎవరినీ నియమించలేదు. కాగా ఎల్లారెడ్డి ఏపీఎం రాంనారాయణగౌడ్‌కు నాగిరెడ్డిపేట అదనపు బాధ్యతలు అప్పగిస్తూ డీఆర్‌డీవో సురేందర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాంనారాయణగౌడ్‌ను మండల సమాఖ్య అధ్యక్షులు బేస్త శాంతతోపాటు సెర్ప్ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

బీఎంఎం జిల్లా అధ్యక్షుడిగా గడ్డం రవి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): భారత్ ముక్తి మోర్చ(బీఎంఎం) కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎండ్రియాల్ గ్రామానికి చెందిన గడ్డం రవిని మంగళవారం ఎన్నుకున్నట్లు బీఎంఎం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. నాపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. చురుకుగా పని చేసి బీఎంఎంను మరింత బలోపేతం చేస్తానన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఈనెల 13న భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, జోనల్ అధ్యక్షుడు లొంక వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డిలు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భారతీయ కిసాన్ సంఘ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ తరగతులకు సంబంధించిన పలు అంశాలను చర్చించారు. మండల కార్యదర్శి మార నారాయణరెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శివకుమార్ సూచించారు. ప్రభుత్వం నిరుపేదల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకొని పారదర్శకంగా ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. మంగళవారం ఎర్రాపహాడ్, నందివాడ గ్రామాలలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరగా నిర్మించుకుంటే డబ్బులు త్వరగా చెల్లిస్తామన్నారు. అలాగే గ్రామంలో తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద నైట్ వాచ్‌మెన్‌గా పనిచేసే నర్సింలు మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి రూ.20 వేలు, ఈవో శ్రీధర్‌రావ్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. వారి వెంట ఆలయ అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట మండల కేంద్రానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు ప్రసాద్‌గౌడ్, నగేష్, అశోక్, వినోద్, సాయిలు, శివలాల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

9న సామూహిక సత్యనారాయణ వ్రతం

కామారెడ్డి అర్బన్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఈనెల 9న పట్టణ పరిధిలోని దేవునిపల్లి శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం, అన్నప్రసాదం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి గుడెల్లి రమణ తెలిపారు. సామూహిక వ్రతంలో పాల్గొనే భక్తులు 94915 87872 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సగం డబ్బులతో సగమే కట్టారు

- అసంపూర్తి పనులతో వృథాగా ఉన్న వ్యవసాయశాఖ భవనం
- తొమ్మిదేళ్లు గడిచినా పట్టించుకోని అధికార యంత్రాంగం



ఇరుకైన ఆయిల్ సీడ్ గోదాములో ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయం



ఎల్లారెడ్డిలో నిర్మాణంలో ఉన్న వ్యవసాయ శాఖ భవనం

ఎల్లారెడ్డి: దాదాపు రూ.40 లక్షల అంచనాతో మొదలు పెట్టిన వ్యవసాయ శాఖ భవనం అసంపూర్తి పనులతో 9 ఏళ్లుగా ఎటూ కాకుండా మిగిలిపోయింది. డివిజన్ కేంద్రంగా ఏర్పడిన ఎల్లారెడ్డిలో ప్రస్తుతం ఆయిల్ సీడ్ గోదాములో వ్యవసాయశాఖ కార్యాలయం కొనసాగుతోంది. ఈ భవనంలోనే వ్యవసాయశాఖ కార్యాలయం, ఏడీఏ కార్యాలయం, ఏవో కార్యాలయాలు ఉన్నాయి. ఇరుకైన ఈ భవనం కార్యాలయ అవసరాలకు ఏ మాత్రం సరిపోవడం లేదన్న ఉద్దేశంతో అప్పటి స్థానిక నాయకుల అభ్యర్థన మేరకు 2016–17 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎల్లారెడ్డి, బాన్సువాడలలో సమీకృత వ్యవసాయశాఖ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనల మేరకు రూ.40 లక్షల నిధులను వ్యవసాయశాఖ మంజూరు చేసింది. నామినేటెడ్ పద్ధతిన ఈ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో 2017లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవన సముదాయంలో ఏడీఏ, ఏవో కార్యాలయాలు, వ్యవసాయ శాఖ కార్యాలయం, రైతుల సమావేశపు హాల్ తదితర కార్యాలయాలను ఒకే భవన సముదాయంలో నిర్మించారు. మంజూరు చేసిన నిధులలో సగం కూడా విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా వదిలేశారు.

మిగిలిన ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, విద్యుత్ పనులు..

భవనానికి ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, విద్యుదీకరణ లాంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. 2017–18 ఆర్థిక సంవత్సరం తర్వాత నిర్మాణ పనులకు ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో రూ.లక్షలు పెట్టి నిర్మించిన భవనం వృథాగా పడి ఉంది. ఇటీవల జరిగిన జిల్లా దిశ సమావేశంలో అసంపూర్తి పనులతో వృథాగా ఉన్న ఈ భవనం విషయమై ఎమ్మెల్యే మదన్ మోహన్ చర్చించారు. ఈ భవనం నిర్మాణ పనులకు అవసరమైన నిధుల విషయమై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ఎంపీ లాడ్స్ నుంచి నిధులు మంజూరు చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ హామీ ఇచ్చారు. ఎంపీ లాడ్స్ నిధులు సరిపోకపోతే తన సీడీపీ ఫండ్స్ నుంచి నిధులను కూడా మంజూరు చేస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్ తెలిపారు. భవన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి రూ.20 లక్షల ప్రతిపాదనలను ఇటీవల వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. త్వరలో ఈ పనులకు నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేశాం

ఎల్లారెడ్డిలో అసంపూర్తిగా ఉన్న సమీకృత వ్యవసాయ భవన సముదాయపు భవన నిర్మాణ పనులను పూర్తి చేయడానికి ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌లు సంసిద్ధత వ్యక్తం చేశారు. వారి ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేయిస్తాం.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి

ఇది రోడ్డా లేక గుంతల సముదాయమా?



పాల్వంచ మండల కేంద్రంలో అధ్వానంగా తయారైన రోడ్డు

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలో కామారెడ్డి–సిరిసిల్ల రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో గ్రామంలోకి వెళ్లే ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా రక్షిత మంచి నీటి సరఫరా పైపు లైన్ లీకై రోడ్డుపై ఏర్పడిన గుంతల్లోకి నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెత్తాచెదారం తొలగింపు

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామంలోని నాలుగో వార్డులో ఉన్న మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది మంగళవారం తొలగించారు. 'సాక్షి' దినపత్రికలో కాలువల్లో పేరుకుపోతున్న మురికి పేరిట ప్రచురితమైన నేటి చిత్రం ఫొటో కథనానికి ఎంపీడీవో రాజ్ కిరణ్‌రెడ్డి, ఈవో లక్ష్మి స్పందించారు. వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారాన్ని మురికిని పూర్తిగా తొలగింపజేశారు.

భిక్కనూరులో అన్ని బస్సులు ఆపాలి

భిక్కనూరు: అన్ని డిపోల బస్సులు మండల కేంద్రంలో ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కామారెడ్డి జిల్లా యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు జ్ఞానప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు సోమవారం కామారెడ్డి డిపో మేనేజర్ కరుణశ్రీని కలిసి వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రం మీదుగా కొన్ని బస్సు డిపోల బస్సులు వెళ్లడం లేదని బైపాస్ గుండా వెళ్తున్నాయని దీని వల్ల ప్రయాణికులకు ఇబ్బంది పడుతున్నారని ఆమెకు వివరించారు. ప్రతినిధులు శంకర్, డప్పు రవి, బాలయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయ వేళలు మార్చాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం తెరిచే సమయం మార్చాలని పాఠకులు కోరారు. గతంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు తెరిచేవారు. ప్రభుత్వం 20 రోజుల నుంచి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు గ్రంథాలయాలను కొన సాగిస్తున్నారు. పత్రికలు చదివేవారికి ఈ సమయం ఇబ్బందిగా మారిందని, సమయాన్ని మార్చడంతో హోటళ్లు, కిరాణ షాపులలో పత్రికలను చదవాల్సి వస్తుందన్నారు. అధికారులు స్పందించి పాత సమయ వేళలు కొనసాగించాలని పాఠకులు కోరుతున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శరత్ అన్నారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీలో రోగులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, వారానికొకసారి డ్రమ్ములలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని అన్నారు. దోమల నివారణకు దోమతెరలు వినియోగించాలని సూచించారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి



ఆశావర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ శరత్



రాజంపేట: సమావేశంలో పాల్గొన్న ఆశాలు

ఎల్లారెడ్డిరూరల్: ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను అందించాలని మత్తమాల మెడికల్ ఆఫీసర్ శరత్ సూచించారు. మంగళవారం మత్తమాల పీహెచ్‌సీలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 11న ప్రతి పాఠశాలలో చిన్నారులకు మాత్రలను అందించి వారికి వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీని వలన నట్టలను నివారించవచ్చన్నారు.

మాత్రల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి

రాజంపేట: నట్టల నివారణ మాత్రల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని మండల వైద్యాధికారి విజయ మహాలక్ష్మి సూచించారు. పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డేను నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 11 నుండి 18 వరకు నట్టల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సంగీత, సూపర్‌వైజర్ మహమ్మద్ మంజూర్, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



రాజంపేట సొసైటీ పరిధిలో మొక్కలు నాటుతున్న చైర్మన్ అశోక్, డైరెక్టర్లు



కోనాపూర్ రైతు వేదిక వద్ద..

రాజంపేట: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని రాజంపేట సింగిల్ విండో చైర్మన్ నల్లవెల్లి అశోక్ అన్నారు. రాజంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా సొసైటీ ఆవరణలో మొక్కలు నాటారు. డైరెక్టర్లు మల్లగారి బాలయ్య, సుధాకర్ రెడ్డి, సాయిబాబా, బస్వయ్య, చింతల సునీత, సీఈవో వెంకటేశ్వర శర్మ పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: కోనాపూర్ రైతువేదిక వద్ద మంగళవారం వనమహోత్సవంతో భాగంగా ఏఈవో జ్ఞానేశ్వర్ రైతులతో కలిసి మొక్కలు నాటారు. మాజీ ఎంపీటీసీ హన్మాండ్లు, రైతులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం



పెద్దదడ్గిలో కరపత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరుణతార, బీజేపీ నేతలు



బాన్సువాడలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

బిచ్కుంద(జుక్కల్): రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత అరుణతార అన్నారు. మంగళవారం పెద్దదడ్గిలో బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అరుణతార మాట్లాడుతూ.. పథకాలకు కేంద్ర ప్రభుత్వం తమ వాటాగా నిధులు మంజూరు చేస్తున్నా తామే మొత్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని సర్వేలో తెలుసుకుని ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, నెరవేర్చని హామీలపై కరపత్రాలు, స్టిక్కర్లు గ్రామంలో అంటించారు. నేతలు మల్లికార్జున్, విష్ణు, గణపతి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీజేపీ ధ్యేయం

బాన్సువాడ: పేదల సంక్షేమానికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ అసెంబ్లీ మాజీ కన్వీనర్ చీదరి సాయిలు అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలో మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పైడిమల్ లక్ష్మీనారాయణ, చిరంజీవి, చీకట్ల రాజు ఉన్నారు.

ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదు



భిక్కనూరు: సమస్య ఎంత పెద్దదైనా ఆత్మహత్య పరిష్కారం కాదని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం సౌత్‌క్యాంపస్‌లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని అశ్విని సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని, కాస్త ఆలోచించుకోవాలన్నారు. ఆత్మహత్యల వల్ల తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోతారని వ్యాఖ్యానించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, హాస్టల్ వార్డెన్‌లు సునీత, యాలాద్రి, అధ్యాపకులు మోహన్‌బాబు, అంజయ్య, లలిత, హరిత, నారాయణ, శర్మ, నర్సయ్య, శ్రీకాంత్, దిలీప్‌లు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి నిధుల మంజూరుపై హర్షం



మద్నూర్(జుక్కల్): మార్కెట్ కమిటీ, మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు రూ.69 లక్షల నిధులు మంజూరు చేయడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సౌజన్య, వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ మాట్లాడారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రత్యేక కృషి వల్లే నిధులు వచ్చాయన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చిత్రపటాలకు వారు పాలతో అభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, సలాబత్‌పూర్ ఆలయ చైర్మన్ రాంపటేల్, మాజీ సర్పంచ్ విఠల్‌గురుజీ, నాయకులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిధులు మంజూరు



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రజిత

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ అభివృద్ధికి రూ.2 కోట్ల 34 లక్షల నిధులు మంజూరైనట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ రజిత తెలిపారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. భవనానికి రూ.86 లక్షల 80 వేలు, షాపింగ్ కాంప్లెక్స్‌కు రూ.83 లక్షల 80 వేలు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.18 లక్షల 80 వేలు, టాయిలెట్ల నిర్మాణానికి రూ.13 లక్షలు, వేబ్రిడ్జి నిర్మాణానికి రూ.32 లక్షల 50 వేల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే, మంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్లు గంగారెడ్డి, శంకరయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పంచాయతీలో కార్మికులు లేక ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంది. కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు పనులు చేయడానికి ముందుకు రావడంలేదు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం స్పష్టంగా కనిపిస్తోంది. బూరుగుపల్లి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదు. కాలువలకు స్థలం వదలకుండా సీసీ రోడ్డు నిర్మించారు. వర్షం వస్తే రోడ్డు పక్కన ఉన్న చెత్త కూడా రోడ్డుపై ప్రవహిస్తోంది.

ఢిల్లీలో ధర్నాకు ఆర్టీసీ విశ్రాంత కార్మికులు



బాన్సువాడ: ఢిల్లీలోని జంతర్మంతర్ ఈ నెల 4, 5వ తేదీల్లో జరిగిన ఈపీఎస్95 పెన్షన్‌దారుల ధర్నాకు బాన్సువాడ ఆర్టీసీ విశ్రాంత కార్మికులు తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈపీఎస్ 95 కనీస పెన్షన్ రూ.100 నుంచి రూ.7500లకు పెంచాలని, డీఏ, విశ్రాంత కార్మికుల భాగస్వాములకు ఉచిత వైద్యం కల్పించాలని డిమాండ్ చేసినట్లు కార్మికులు తెలిపారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయాలి



కొండాపూర్ గ్రామసభకు హాజరైన గ్రామస్తులు.. పాల్గొన్న ఎంపీవో మలహరి

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన యాప్‌లో వివరాలు పూర్తిగా నమోదు చేయాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. మంగళవారం ఆయన నల్లమడుగులో పీఎం ఆవాస యోజన యాప్ ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. ప్రజాపాలన గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల వివరాల నమోదును వేగవంతం చేయాలని సూచించారు.

అలాగే ఎంపీవో మలహరి మండలంలోని కొండాపూర్, ముంబోజీపేట గ్రామ సభల్లో పాల్గొన్నారు. ఇంటి పన్నులు చెల్లించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జీపీ కార్యదర్శులు జైల్‌సింగ్, రఘూసీ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తం

కామారెడ్డికి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎమ్మార్పీయస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కామారెడ్డికి తరలివెళ్లారు. కామారెడ్డిలో నిర్వహించతలపెట్టిన మరోగర్జన సన్నాహక సభలో పాల్గొనేందుకు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తొంట సాయిలు, తదితరులున్నారు.

పొలంలో చెత్త పోయకుండా చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ శివారులో గల పొలంలో చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన నారాయణ పంచాయతి కార్యదర్శిని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందించారు. సర్వే నెంబర్–365లో గ్రామానికి సంబంధించిన చెత్త మొత్తం తీసుకు వచ్చి పోయడం వల్ల పొలంలోకి రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

కుంటలను కాపాడాలని వినతి



నిజాంసాగర్(జుక్కల్): మాగి గ్రామ శివారులో ఉన్న కుంటలను కాపాడాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ భిక్షపతికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గొల్లవానికుంటకు గుర్తుతెలియని వ్యక్తులు గండి కొట్టడంతో నీరు వృథాగా పోతుందన్నారు. అంతేకాకుండా గొల్ల కుంట శిఖం భూములు కబ్జా కాకుండా కాపాడాలని గ్రామస్తులు, ముదిరాజ్ సంఘం నాయకులను కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపి

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు చిన్నారులకు ఇంటి వద్ద చేసే వ్యాయామం గురించి వైద్యురాలు సారిక వివరించారు. ఐఈఆర్‌పీ కమల్ కిషోర్, మండల విద్యాధికారి దేవిసింగ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు నీలి నాలుక నివారణ టీకాలు



బాన్సువాడ రూరల్: సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో మంగళవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు నీలినాలుక నివారణ టీకాలు వేశారు. సోమేశ్వర్‌లో 105, దేశాయిపేట్‌లో 85 గొర్రెలకు టీకాలు వేసినట్లు సిబ్బంది పాండురంగం తెలిపారు.